క్లుప్తంగా

పాఠశాల పనివేళల్లో మార్పు సరికాదు

వీరఘట్టం: పైలట్ ప్రాజెక్టు క్రింద ఉన్నత పాఠశాలల్లో పనివేళల్లో మార్పులు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరైనదికాదని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ మీడియా సెల్ కన్వీనర్ అన్ను వెంకటరావు అన్నారు. మంగళవారం ఆయన వీరఘట్టంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నత పాఠశాలలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేయు విధానం అశాస్త్రీయమైందన్నారు. దీని వల్ల ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు కూడా ఒత్తిడికి గురవుతారన్నారు. ఇటువంటి నిర్ణయాలు విద్యా వ్యవస్థ పతనానికి దారితీస్తాయన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాల్లో చదివే బాలికలు ఇంటికి వెళ్లేందుకు ఇబ్బందులు పడతారని, ఈ నిర్ణయంపై ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరారు.

వినతిపత్రం అందజేత

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం, మండ, ఎల్విన్‌పేట గ్రామ సచివాలయాల భవన నిర్మాణ పనులకు సంబంధించిన పెండింగ్ పేమెంట్లు విడుదల చేయాలని కోరుతూ జిల్లా నీటి యాజమాన్యం పీడీ కె.రామచంద్రారావుకు సర్పంచ్‌లు బి.గౌరీశంకరరావు, ఎన్.హైమావతి, ఆర్‌ఎస్ చైతన్య స్రవంతిలు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఉపాధి హామీ పథకం పనులపై జరిగిన సోషల్ ఆడిట్‌కు సంబంధించి, గుమ్మలక్ష్మీపురంలో జరిగిన ప్రజావేదిక కార్యక్రమంలో వీరంతా కలిసి, నిధులు విడుదలకు చొరవ తీసుకోవాలని కోరారు. పనులు పూర్తి చేసి రెండేళ్లు పూర్తి కావస్తున్నా ఇప్పటివరకు తమకు పేమెంట్లు చెల్లించలేదని తెలిపారు.


ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

గరుగుబిల్లి: మండలంలోని గొట్టివలస గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్మకాలు చేయాలన్నారు. ధాన్యం విక్రయించిన 48 గంటల్లో రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ఒ.ప్రభాకరరావు, తహసీల్దారు పి.బాల, ఎంపీడీవో జి.పైడితల్లి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

కొమరాడ: ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యారోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహనరావు సూచించారు. మండలంలోని కేఆర్‌బీ పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన మంగళవారం సందర్శించి, రికార్డులు, సిబ్బంది పనితీరును పరిశీలించి, పలు సూచనలు చేశారు. అనారోగ్యంతో ఆస్పత్రికి వచ్చే వారి ఆరోగ్య సమస్యను క్షుణ్ణంగా తెలుసుకుని, తగిన వైద్యం అందజేయాలని తెలిపారు. ఆస్పత్రిలోనే ఎక్కువ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యాక్సిన్లు నిల్వ ఉంచుకోవాలన్నారు. కుక్కకాటు, పాముకాటు విరుగుడు ఇంజిక్షన్లు ఉన్నాయా లేదా అని తెలుసుకుని, రాత్రి వేళల్లో కూడా సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు టి.గణేష్, సామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థిని ప్రతిభ



సీతంపేట: జాతీయస్థాయి ఉమెన్ ఇన్ ఏవియేషన్ ఇండియా వ్యాసరచన పోటీల్లో సీతంపేట మండలం రామానగరం గ్రామానికి చెందిన ఆరిక అనిత ప్రతిభ కనబర్చారు. ఆమె శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ చదువుతోంది. ఇటీవల ఢిల్లీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయానశాఖ కార్యదర్శి యు.ఉల్నామ్, ఉమెన్ ఇన్ ఏవియేషన్ ఇండియా అధ్యక్షుడు రాధా బాటియా, ఏవియేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా చైర్మన్ విపిన్ కుమార్ చేతుల మీదుగా బహుమతి అందుకుంది. గిరిజన విద్యార్థిని ప్రతిభ పట్ల తల్లిదండ్రులు చిరంజీవి, సరోజిని, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

వీడని గజరాజుల బెడద

కొమరాడ: మండల వాసులను గజరాజుల బెడద వీడడం లేదు. కొమరాడ మండలంలోని డంగభద్ర, కందివలస, గంగారేగువలస తదితర గ్రామాల్లో మంగళవారం సంచరించాయి. ఇక్కడ సాగుచేసిన కూరగాయల పంటలను నాశనం చేస్తుండడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. వేలాది రూపాయల పెట్టుబడి పెట్టి సాగుచేసిన పంట చేతికొచ్చిన సమయంలో ఏనుగులు ధ్వంసం చేస్తుండడంపై గగ్గోలు పెడుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగుల తరలింపునకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వరిపంట దగ్ధం

భామిని: ఎంతో శ్రమించి పండించిన వరిపంట నూర్పిడి దశలో జరిగిన అగ్ని ప్రమాదంలో బూడిదయ్యింది. మండలంలోని బూర్జగూడలో మంగళవారం ఈ దుర్ఘటన జరిగింది. ఏటంగూడకు చెందిన హోంగార్డు ఆరికి తేజేశ్వరరావుకు చెందిన భూమిని బంద్రసింగికి చెందిన ఆదివాసీ రైతు పాలక సుక్కు కౌలుకు సాగుచేస్తున్నారు. పంటను నూర్పిడి చేస్తుండగా అగ్ని ప్రమాదం జరగడంతో వరిపంటతో పాటు ట్రాక్టర్ పూర్తిగా దగ్ధమైంది.



గరుగుబిల్లి: గొట్టివలసలో చెరువు పనుల వద్ద రాజ్యాంగ పరిరక్షణ ప్రతిజ్ఞ చేస్తున్న సర్పంచ్ చంద్రినాయుడు తదితరులు



పాలకొండ రూరల్: స్థానిక డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు రాజ్యాంగ స్ఫూర్తిని వివరిస్తున్న ప్రిన్సిపాల్ శ్యాంబాబు



గుమ్మలక్ష్మీపురం: అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న ఏడీ రామచంద్రారావు



పాలకొండ: నగర పంచాయతీ కార్యాలయం వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న పాలకవర్గ సభ్యులు



జియ్యమ్మవలస: చినమేరంగిలో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న సీఐ తిరుపతిరావు



వీరఘట్టం: వండువలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి



గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో రాజ్యాంగం విశిష్టతను తెలుపుతున్న ప్రిన్సిపాల్ శ్రీవరం



వీరఘట్టం: మహాత్మా గాంధీ, బీఆర్ అంబేద్కర్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ వెంకటరమణ, తదితరులు

రాజ్యాంగంతోనే సామాజిక న్యాయం

వాడవాడలా రాజ్యాంగ దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. మన దేశ పాలనకు మనకు మనం సొంతంగా రూపొందించుకున్న రాజ్యాంగాన్ని 1949 నవంబరు 26న రాజ్యాంగ పరిషత్ ఆమోదించిన సుదినం పురస్కరించుకుని, ఏటా ఈ దినోత్సవం జరుపుకుంటుండడం విశేషం. ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని, రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. దేశ ప్రజలందరికీ ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో సమానత్వం ఇవ్వడానికి, సామాజిక న్యాయం ప్రోత్సహించడానికే రాజ్యాంగాన్ని రూపొందించారని వక్తలు తెలిపారు. ప్రతిఒక్కరూ రాజ్యాంగాన్ని అనుసరించి, గౌరవించాలని కోరారు. అనంతరం రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడదామని పిలుపునిస్తూ ప్రతిజ్ఞ చేశారు. -పాలకొండ, కురుపాం నెట్‌వర్క్



జియ్యమ్మవలస: ఎంపీడీవో కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవంలో కార్యాలయ సిబ్బంది



సీతంపేట: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఐటీడీఏ అధికారులు, సిబ్బంది



భామిని: ఘనసర కాలనీలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న దళిత సంఘాల నాయకులు



భామిని: రాజ్యాంగ దినోత్సవంలో భాగంగా నృత్యాలు చేస్తున్న మోడల్ స్కూల్ విద్యార్థులు

'మత్తు'తో జీవితం నాశనం

కొమరాడ: గంజాయి, కొకైన్, ఖైనీ, గుట్కా, మద్యం, సారా వంటి మత్తు పదార్థాలతో జీవితం నాశనం అవుతుందని ఎస్‌ఐ కె.నీలకంఠం హెచ్చరించారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా మండలంలోని సుందారపురంలోని ప్రజలకు మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ప్రస్తుతం యువత, విద్యార్థులు ఎక్కువగా ఫ్యాషన్ మాయలో పడి చెడు అలవాట్లకు బానిసలై తమ బంగారు భవిష్యత్‌ను చెడగొట్టుకుంటున్నారన్నారు. ప్రతిఒక్కరూ విద్యార్థి దశ నుంచే మంచి అలవాట్లు అలవర్చుకుని, ఆదర్శవంతమైన జీవనం సాగించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గొర్లి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నీలకంఠం

ఏరియా ఆస్పత్రిలో సదరం సేవలు

సీతంపేట: స్థానిక ఏరియా ఆస్పత్రిలో సదరం క్యాంపును మంగళవారం నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇకపై వారంలో రెండు సార్లు (మంగళ, బుధవారాల్లో) సదరం క్యాంపులు నిర్వహించనున్నట్లు చెప్పారు. అర్హులైన దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్లు జారీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎంఓ డీవీ శ్రీనివాసరావు, డాక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



సదరం క్యాంపు నిర్వహిస్తున్న వైద్యులు

టార్పాలిన్ల పంపిణీ

సీతంపేట: గిరిజన రైతులు టార్పాలిన్లను సద్వినియోగం చేసుకోవాలని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. మండలంలోని కుడ్డపల్లి గ్రామంలో గిరిజన రైతులకు మంగళవారం టార్పాలిన్లతో పాటు వేరుశనగ, మినుము విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గీతాంజలి, వ్యవసాయాధికారి గీతాంజలి పాల్గొన్నారు.



టార్పాలిన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదు

గుమ్మలక్ష్మీపురం: ఉపాధి హామీ పథకం పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని జిల్లా నీటి యాజమాన్యం పథక సంచాలకులు కె.రామచంద్రారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మండల వ్యాప్తంగా జరిగిన ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి, చేపట్టిన సోషల్ ఆడిట్‌పై ప్రజావేదిక మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి పనులకు సంబంధించిన నేమ్, సమాచార బోర్డులు ఏర్పాటు చేయకపోవడం, పే ఆర్డర్లు జనరేట్ చేయడం, రాతికట్ల పనులు, అమృత్ సరోవర్ చెరువుల అభివృద్ధి పనులతో పాటు రింగ్ ట్రెంచ్, కందకాల తవ్వకం పనుల్లో కొలతల్లో తేడాలు ఉండడం, పనికి వెళ్లని వారికి కూడా మస్తర్లు వేసి, వేతనాలు మంజూరు చేయడం, బీరుపాడు, చినగీసాడ పంచాయతీల్లో నలుగురు వేతనదారులు చనిపోయినప్పటికీ వారి పేర్ల మీద పనులు చేసినట్లు, వేతనాలు చెల్లించినట్లు ఆడిట్ బృందం గుర్తించి, ప్రజావేదికలో తెలిపారు. ఈ మేరకు స్పందించిన ఆయన.. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం పనికిరాదని చెప్పి, రికవరీ కోసం ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.సాల్మన్‌రాజు, పంచాయతీరాజ్ ఏఈఈ కె.మురళీధర్, ఎస్‌ఆర్‌పీ ఎస్.మాధవరావు, ఏపీవో బాబూరావు, ఈసీ శేషగిరిరావు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



ప్రజావేదికలో ఉపాధిహామీ పనుల వివరాలు పరిశీలిస్తున్న డుమా పీడీ రామచంద్రారావు

లింగ సమానత్వం పాటించాలి

సీతంపేట: మహిళల పట్ల వివక్ష తగదని, లింగ సమానత్వం పాటించాలని తహసీల్దార్ అప్పలరాజు అన్నారు. వెలుగు, ఐసీడీఎస్ సిబ్బంది ఆధ్వర్యంలో సీతంపేటలో మంగళవారం చైతన్య ర్యాలీ నిర్వహించారు. స్థానిక వెలుగు కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ అప్పలరాజు, వెలుగు ఏపీడీ సన్యాసిరావు, డీపీఎం ఎంవీ రమణ, ఏపీఎం కమలకుమారి, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ ప్రారంభిస్తున్న తహసీల్దార్ అప్పలరాజు

సబ్‌కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

వీరఘట్టం: మండలంలోని హుస్సేనుపురం గ్రామంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)ను పాలకొండ సబ్‌కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీహెచ్‌సీలో ఉన్న మందులు, వాటి కాలపరిమితి, తదితర అంశాలను పరిశీలించారు. సీహెచ్‌సీలో అందిస్తున్న వైద్య సేవలపై స్థానికుల వద్ద ఆరా తీశారు. సీహెచ్‌సీకి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ చందక సత్యనారాయణ ఉన్నారు.



సీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

నేడు దివ్యాంగుల ఉపకరణాల ఎంపిక శిబిరం

పాలకొండ: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో బుధవారం దివ్యాంగులు, వయోవృద్ధులకు ఉపకరణాల ఎంపిక శిబిరం నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ విజయరంగారావు తెలిపారు. అలీమ్ కో సంస్థ హైదరాబాద్ వారి సహకారంతో జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిబిరంలో దివ్యంగుల అవసరాలను గుర్తించి వారికి ఉపకరణాలు అందించడం జరుగుతుందన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పశువులు తరలిస్తున్న వ్యక్తులపై కేసు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): గుమ్మలక్ష్మీపురం నుంచి పార్వతీపురం వైపు ఓ బొలెరో వాహనంలో 10 పశువులను తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు కురుపాం ఎస్‌ఐ పి.నారాయణరావు మంగళవారం తెలిపారు. కురుపాం మండలం మూలిగూడ జంక్షన్ వద్ద వాహన తనిఖీలు చేపడుతుండగా, అక్రమంగా తరలిస్తున్న పశువులు పట్టుబడ్డాయని, వాటిని కొత్తవలస గోశాలకు పంపించామన్నారు.

ఆటో బోల్తా: ఐదుగురికి గాయాలు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కొత్తగూడ గ్రామ సమీపంలో ఆటో బోల్తా పడిన దుర్ఘటనలో ఐదుగురికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి.. టెంకసింగి గ్రామానికి చెందిన బి.శకుంతుల, తవిటమ్మ, పారమ్మ, పి.పద్మావతి, పార్థసారథిలు ఏదో పని నిమిత్తం గుమ్మలక్ష్మీపురానికి మంగళవారం వచ్చి, తిరిగి ఆటోలో తమ గ్రామానికి వెళ్తుండగా, కొత్తగూడ సమీపంలో కుక్కల గుంపు వారి ఆటోకు ఎదురుగా రావడంతో ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న సదరు వ్యక్తులకు గాయాలయ్యాయి. స్థానికులు అప్రమత్తమై, చికిత్స నిమిత్తం వారిని భద్రగిరి ఆస్పత్రికి తరలించారు. అక్కడ వారికి ప్రాథమిక చికిత్స అందజేయగా, మెరుగైన వైద్యం కోసం క్షతగాత్రుల్లోని తవిటమ్మ, పారమ్మ, పద్మావతిలను పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశారు.

మిల్లెట్స్ కిచెన్ ప్రారంభం

భామిని: మండలంలోని బొడ్డగూడలో గిరిజన మహిళా సంఘాల సభ్యులతో చేపట్టిన మిల్లెట్స్ కిచెన్‌ను నాబార్డు డిప్యూటీ డైరెక్టర్ ఎం.దినేష్‌కుమార్ మంగళవారం ప్రారంభించారు. వాస్సన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హెచ్‌డీఎఫ్‌సీ పరివర్తన పథకంలో భాగంగా సుమారు రూ.3 లక్షలతో ఈ యూనిట్ ఏర్పాటు చేయించినట్లు చెప్పారు. మిల్లెట్స్ కిచెన్‌లో తయారు చేసిన చిరుతిళ్లను డీడీ రుచి చూశారు. గిరిజన మహిళలకు ఒడిశాలో మిల్లెట్స్ వంటకాల తయారీలో శిక్షణ ఇప్పించినట్లు వాస్సన్ సంస్థ ప్రతినిధులు కళ్యాణ్ పాత్రో, మనోజ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో బలరాం, ప్రియాంక, రమణబాబు, తదితరులు పాల్గొన్నారు.

దోనుబాయి వైద్య సిబ్బందికి షోకాజ్ నోటీసులు

సీతంపేట: దోనుబాయి పీహెచ్‌సీ వైద్యాధికారి భానుప్రతాప్‌తో పాటు ల్యాబ్ టెక్నీషియన్ వసంతబాబు, సూపర్‌వైజర్ గంగమ్మకు షోకాజ్ నోటీసులు జారీచేసినట్లు ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీహెచ్‌సీని ఆకస్మికంగా సందర్శించిన సమయంలో వైద్యాధికారి, ల్యాబ్ టెక్నీషియన్ డ్యూటీలో లేకపోవడం, సూపర్‌వైజర్ ఉన్నప్పటికీ విధుల పట్ల అవగాహన లేకపోవడంతో షోకాజ్ నోటీసు ఇచ్చామన్నారు.

విధినిర్వహణలో అలసత్వం వద్దు

- ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ బాబ్జీరావు

పాలకొండ రూరల్: ఎక్సైజ్ సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దని ఆ శాఖ డిప్యూటీ కమిషనర్ బాబ్జీరావు స్పష్టం చేశారు. స్థానిక ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఇక్కడి రికార్డులు పరిశీలించారు. నమోదైన కేసుల, వాటి పురోగతి, సీజ్ చేసిన మద్యం నిల్వలు, వాహనాల వివరాలను సీఐ సూర్యకుమారిని అడిగి తెలుసుకున్నారు. బెల్ట్ షాపులపై నిఘా పెట్టాలని, ఏజెన్సీలో సారా తయారీ జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల పరిధిలో నూతన మద్యం షాపుల తనిఖీలు చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం కోటదుర్గమ్మ సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించారు.



దుర్గమ్మ దేవస్థానంలో అర్చకుల ఆశీర్వాదం పొందుతున్న ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్

సేంద్రియ పంటలతో ఆరోగ్యం

భామిని: ఎటువంటి క్రిమిసంహారకాలు, ఎరువులు ఉపయోగించకుండా ప్రకృతి సాగు పద్ధతిలో పండించిన సేంద్రియ పంటలు ఆరోగ్యానికి మేలు చేస్తాయని మండల వ్యవసాయాధికారి కె.సింహాచలం, ఉపాధి ఏపీఓ ఇ.తులసీదాస్ అన్నారు. మండల కేంద్రంలో ఏపీఎస్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సేంద్రియ పంటల ప్రదర్శనను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అతి తక్కువ వ్యయంతో గోమూత్రం, ఆకులు, అలమల కషాయంతో పండించిన పంటల్లో విటమిన్లు, పోషకాలు అధికంగా ఉంటాయన్నారు. వెలుగు ఏపీఎం ఎం.చక్రపాణి, ఇతర ఉద్యోగులు సేంద్రియ పంటలు, కూరగాయలు, ఆహార ధాన్యాలను కొనుగోలు చేశారు.



సేంద్రియ పంటల ప్రదర్శనలో ఏఓ సింహాచలం, ఏపీఓ తులసీదాస్

పారదర్శకంగా ధాన్యం కొనుగోలు

- ఎమ్మెల్యే జయకృష్ణ

వీరఘట్టం: ధాన్యం కొనుగోలును పారదర్శకంగా చేపట్టాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. మండలంలోని హుస్సేనుపురంలో సబ్‌కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డితో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. రైతులకు గరిష్ట గిట్టుబాటు ధర వచ్చేలా చూడాలని అధికారులకు సూచించారు. అలాగే రైతులకు వేరేచోట ఎక్కువ ధర వస్తే వారు అక్కడ ధాన్యం అమ్ముకోవచ్చన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. హుస్సేనుపురంలో చాలా మంది భూములు ఈ-క్రాప్‌లో నమోదు కాలేదని, దీంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించేందుకు వీలు లేకుండా పోయిందన్నారు. అలాగే మిల్లర్లు ప్రతీ బస్తాకు 5 కిలోల ధాన్యం అదనంగా తూకం వేస్తున్నారని, రైతుల కష్టాన్ని దోచుకుంటున్నారని వాపోయారు. దీనిపై సబ్ కలెక్టర్ స్పందిస్తూ ధాన్యం కొనుగోలులో రైతులకు ఎటువంటి సమస్య రాకుండా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీఏ రత్నకుమారి, ఏఓ జె.సౌజన్య, కూటమి నాయకులు గర్భాన సత్తిబాబు, పొదిలాపు కృష్ణమూర్తినాయుడు, ఉదయాన ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ, సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

7న మెగా పేరెంట్, స్టూడెంట్స్ డే

వీరఘట్టం: డిసెంబర్ 7న అన్ని పాఠశాలల్లో మెగా పేరెంట్, స్టూడెంట్స్ డేని నిర్వహించాలని జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో విద్యాశాఖ అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పేరెంట్, స్టూడెంట్ డేను ఓ పండగలా నిర్వహించాలని, ప్రతీ పేరెంట్‌కు, విద్యాకమిటీ సభ్యులను, స్థానిక ప్రజాప్రతినిధులకు ప్రత్యేక ఆహ్వానాలు పంపించాలని సూచించారు. ప్రతీ విద్యార్థి ప్రొగ్రెస్‌ను వారి తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. ఈ మెగా ఈవెంట్‌ను అందరి భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని సూచించారు. ఎంపీడీఓ బి.వెంకటరమణ, ఎంఈఓలు డి.గౌరినాయుడు, ఆర్.ఆనందరావు, అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

పాలకొండ రూరల్: నిబంధనలకు విరుద్ధంగా అధిక లోడుతో వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాలకు కారకులు కావద్దని ఎంవీఐ తంగి వేణుగోపాలరావు సూచించారు. పాలకొండ-వీరఘట్టం ప్రధాన రహదరిలో మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. ముఖ్యంగా అధిక లోడుతో వచ్చే ట్రాక్టర్లు, ఆటోలు, ఇతర వాహనాలను నిలుపుదల చేసి డ్రైవర్లకు రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా వ్యవసాయ సీజన్ కావటంతో చెరకు, ధాన్యం, గడ్డి, ఊక, తౌడు తదితర వాటిని నిబంధనలకు విరుద్ధంగా అధికంగా లోడు చేయడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఈ క్రమంలో నిబంధనలు అతిక్రమించిన రెండు ట్రాక్టర్లపై అపరాధ రుసుం విధించారు. ఆయన వెంట సహాయ మోటారు వెహికల్ అధికారి నవీన్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.



ట్రాక్టర్ డ్రైవర్లకు సూచనలు చేస్తున్న ఎంవీఐ వేణుగోపాలరావు